## క్లుప్తంగా

### అహంకారం వీడాలి



వక్తను సత్కరిస్తున్న మందిరం సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: జీవుడు అహంకారాన్ని వీడినప్పుడే మంచి వ్యక్తులవుతారని డి.జి.పట్నాయిక్ అన్నారు. నగరంలోని ఉపనిషన్మందిరంలో 'కాళీయమర్దనము'పై ఆదివారం ప్రసంగించారు. శ్రీకృష్ణుడు కాళీయమర్దన చేయడాన్ని సంసారంలో వచ్చే కష్టనష్టాలతో పోల్చి వివరించారు. కార్యక్రమంలో కోమలరావు, రంగడు ప్రసాదరావు, నరసింహమూర్తి, సంగమేశ్వరరావు, విశ్వేశ్వరరావు, సత్యనారాయణ, ఈశ్వరరావు, బాబూరావు, సరోజిని, సరస్వతి, లక్ష్మీ పాల్గొన్నారు.

### కూర్మనాథుని సన్నిధిలో ఆండవన్ పీఠాధిపతి



స్వామి సన్నిధిలో శ్రీనివాస గోపాల దేశికన్

గార: ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీకూర్మంలోని కూర్మనాథున్ని పండరీకపురం ఆండవన్ మఠం పీఠాధిపతి శ్రీనివాస గోపాల దేశికన్ స్వామీజీ ఆదివారం దర్శించుకున్నారు. రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, అప్పస్మా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసరావులు కూడా స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో ఈఓ కె.నరసింహనాయుడు, నర్సుబాబు తదితరులు పాల్గొన్నారు.


### ఘనంగా సత్యసాయి పల్లకీ ఉత్సవం



పల్లకీ ఉత్సవంలో భక్తులు

గార : మండలంలోని శ్రీకూర్మం, తండ్యాలపేట గ్రామాల్లో ఆదివారం సత్యసాయి పల్లకీ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. సత్యసాయి ధర్మక్షేత్రం ఆధ్వర్యంలో శ్రీకూర్మంలోని పలు వీధుల్లో స్వామివారి సంకీర్తనలు ఆలపిస్తూ భక్తులకు విభూతి ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో భజన మండళ్ల సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

### నందెన్నకు ఫలార్చన



పూజలందుకుంటున్న నందెన్న

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని నక్కవీధి ఉమా జలలేశ్వర స్వామి ఆలయంలో నందెన్న ఉత్సవాలలో భాగంగా ఆదివారం స్వామివారిని వివిధ రకాల ఫలాలతో అర్చన చేశారు. మహిళలు పాల్గొని దీపారాధన నిర్వహించారు.

### ఘనంగా ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవం



కార్యక్రమంలో పాల్గొన్న ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు

శ్రీకాకుళమ కల్చరల్: గుజరాతిపేటలోని మహాలక్ష్మీ కల్యాణ మండపంలో ఆదివారం ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ఎస్ కార్యవాహక్ డి.వి.రమణమూర్తి మాట్లాడుతూ హిందూ ధర్మంలో మాతృమూర్తుల పాత్ర గొప్పదన్నారు. కార్యక్రమంలో అంధవరపు ప్రసాద్, బస్తీ ప్రముఖ్ పి.రాజశేఖర్, జంధ్యాల శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

### పాస్టర్లకు సత్కారం



పాస్టర్లతో ప్రత్తి అన్వేష్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వైఎస్సార్‌సీపీ ఆంధ్రప్రదేశ్ క్రిస్టియన్ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ప్రత్తి అన్వేష్ ఆధ్వర్యంలో ఆదివారం అంతర్జాతీయ పాస్టర్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. శ్రీకాకుళం నియోజకవర్గంలోని పలు చర్చిల్లో కార్యక్రమం నిర్వహించి పాస్టర్లను సన్మానించారు.

# తాగి వాగితే జైలుకే..!

- బహిరంగంగా మద్యం సేవించినా.. వాహనాలు నడిపినా కఠిన చర్యలు
- పోలీసు విధులకు, పబ్లిక్‌కి అంతరాయం కలిగిస్తే కటకటాలపాలే..





డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

శ్రీకాకుళం క్రైమ్ : 'నేనెవరో తెలుసా.. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో సోషల్ మీడియా ఇన్‌చార్జిని. నువ్వు ఆఫ్ట్రాల్ కానిస్టేబుల్‌గాడివి..' అంటూ ఓ యువకుడు మరో ఇద్దరితో కలిసి పబ్లిక్‌గా ఓ పోలీసుపై తిరగబడ్డాడు. ఇతను గతంలో ఓ చోరీ కేసులో నిందితుడు కూడా.. ఇదే మాదిరి మరో యువకుడు మద్యం మత్తులో ట్రాఫిక్ కానిస్టేబుల్‌పై దాడికి ఎగబడ్డాడు. ఓ ఏఎస్ఐ విధులు నిర్వర్తించుకుని రాత్రి ఇంటికెళ్తుండగా దారిలో బహిరంగంగా మద్యం సేవించి న్యూసెన్సు సృష్టిస్తున్న కొందరు యువకులను ప్రశ్నించాడు. అంతా మూకుమ్మడిగా దాడికి ఎగబడ్డారు. విధుల్లో ఉన్న ఎస్ఐపైనా ఓ వ్యక్తి చేయిచేసుకున్నాడు. నైట్‌బీట్ విధుల్లో ఉన్న ఓ హెడ్ కానిస్టేబుల్‌పై ఓ రౌడీషీటర్ తన సోదరుడితో కలసి దాడి చేశాడు. పైన పేర్కొన్న అన్ని ఘటనలూ జిల్లాకేంద్రంలోనే జరిగాయి. పోలీసులు పరిస్థితే ఇలా ఉంటే సామాన్యుల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఇలాంటి ఘటనలకు అడ్డుకట్ట వేసేందుకు పోలీసులు చర్యలకు ఉపక్రమించారు. బహిరంగంగా మద్యం సేవించినా.. తాగి న్యూసెన్సు చేసినా.. వాహనం నడిపి పట్టుబడినా.. ఇకపై కటకటాలుపాలవ్వాల్సిందే. పోలీసుల విధులకు, పబ్లిక్‌కు అంతరాయం కలిగిస్తే కేసులు కట్టి ఫైన్ వేయడమే కాదు.. ఏకంగా 14 నుంచి 45 రోజుల వరకు జైలు శిక్ష పడేలా కఠిన చర్యలు తీసుకుంటున్నారు. ఒక్క ట్రాఫిక్ పీఎస్ పరిధిలోనే ఈ ఏడాది జనవరి నుంచి 1588 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు కట్టి రూ.7,02,250 ఫైన్ విధించారు. ముగ్గురికి జైలు శిక్ష పడింది. ఒకటో పట్టణ పరిధిలో 47 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో ఏడుగురిని జైలుకు పంపారు. అత్యధికంగా 903 మంది బహిరంగంగా మద్యం సేవిస్తూ పట్టుబడ్డారు. శ్రీకాకుళం నగర పరిధిలో ఎక్సైజ్ పోలీసులు 29 కేసుల్లో మందుబాబులను బెంచ్ కోర్టుకు పంపించారు.

**కొన్ని ఘటనలు పరిశీలిస్తే..**

- శ్రీకాకుళం ఒకటో పట్టణ పరిధిలో వండాన ఢిల్లీశ్వరరావు, బలగ మురళీకృష్ణ అనే రౌడీషీటర్లు, బద్రి త్రినాదరావు మద్యం తాగి న్యూసెన్సు చేయడంతో కోర్టు 14 రోజులు రిమాండ్ విధించింది. వీరితో పాటు లోపింటి నిరంజన్‌భాస్కర్(సస్పెక్ట్‌షీట్) కు 30 రోజులు జైలు శిక్ష పడింది.
- టౌన్‌హాల్ సందులో ద్విచక్రవాహనంపై మద్యం మత్తులో వున్న సల్మాన్, ఎర్రయ్యలు ఎదురుగా తన మనవడితో బైక్‌పై వస్తున్న వృద్ధురాలిని కడిమితో గుద్ది తీవ్రంగా గాయపర్చారు. సల్మాన్, ఎర్రయ్యలకు 20 రోజులు రిమాండ్ కోర్టు విధించింది.
- తాజాగా జిల్లాకేంద్రంలోని పొట్టి శ్రీరాములు కూడలి వద్ద ట్రాఫిక్ పోలీసులు తనిఖీ చేస్తుండగా దమ్మవలవీధికి చెందిన తమిరి సాయి డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డాడు. రోడ్డుమీదే మద్యం మత్తులో వీరంగం చేయడంతో అరెస్టు చేసి కోర్టు ముందు హాజరుపర్చారు,. 45 రోజుల జైలు శిక్ష పడింది.
- గత నెల 19న జిల్లా కోర్టు ఆవరణలో మద్యం సేవించి న్యూసెన్సు సృష్టించిన పొందూరు మండలం వావిళ్లపేట వాసి కోరుకోల దుర్వాసులపై కేసు నమోదు చేశారు. 20న అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకు హాజరుపర్చగా 45 రోజుల జైలు శిక్ష పడింది.

**కఠినంగా వ్యవహరిస్తాం..**



తాగి వాహనాలు నడిపినా, పబ్లిక్‌గా న్యూసెన్సు చేసినా సహించేది లేదు. మా దృష్టిలోకొచ్చిన ప్రతీ ఒక్కరిపై కేసులు కట్టి జైలుకు పంపాం. విధుల్లో ఉన్న పోలీసులపై తిరగబడితే మరిన్ని సెక్షన్లు జోడించి జైలుకు పంపుతాం. ఎస్పీ మహేశ్వరరెడ్డి ఇలాంటి వ్యవహారాల్లో సీరియస్‌గా ఉన్నారు.

– వివేకానంద, డీఎస్పీ

# కల్తీ మద్యంపై పోరుబాటు



మర్రివలసలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

- మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ఉపసంహరించుకోవాలి
- కోటి సంతకాల సేకరణలో ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

జి.సిగడాం : పేద ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీసేలా కల్తీ మద్యం తయారవుతోందని, దీనికి వ్యతిరేకంగా సోమవారం ఉదయం రణస్థలంలో ధర్నా చేపట్టనున్నట్లు ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. ఆదివారం జి.సిగడాం మండలం టీడీవలస, సీతంపేట, నాగులవలస, మర్రివలస, పెంట గ్రామాల్లో మండల పార్టీ అధ్యక్షుడు డోల వెంకటరమణ ఆధ్వర్యంలో మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు సమష్టిగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఆర్టీఐ వింగ్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ కాయల రమణ, జిల్లా అధికార ప్రతినిధి పిల్లల శివకుమార్, మండల మహిళా అధ్యక్షులు వాన ప్రమీల, నియోజకవర్గ ఐటీ వింగ్ అధ్యక్షుడు చిత్తిరి మోహన్, యూత్ అధ్యక్షుడు గేదెల నారాయణరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు. విద్య, వైద్యాన్ని అమ్ముకుంటున్న కూటమి ప్రభుత్వం కూటమి ప్రభుత్వం విద్య, వైద్యాన్ని అమ్ముకుంటోందని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ మండిపడ్డారు. పెంట గ్రామంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ కార్యకర్తలు వేధింపులకు గురైతే డిజిటల్ బుక్ భరోసాగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు టంకాల జగన్మోహిని, పున్నాన సోనియా, గేదెల మల్లిబాబు, విక్రం కోటిబాబు, ఎంపీటీసీ సభ్యులు మక్క శ్రీలత, శ్రీనివాసరావు, పున్నాన అక్కలనాయుడు, పోలారావు, ఇల్లాక రాములు, పున్నాన శంకరావు, టంకాల రాధానందం, టంకాల రామకృష్ణ పాల్గొన్నారు.



పెంట గ్రామంలో కోటి సంతకాల సేకరణ

# కాలువనే కప్పేశారు!

- నిలిచిపోతున్న మూడు వీధుల మురుగునీరు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు



కాలువను కప్పేసిన ప్రాంతాన్ని చూపుతున్న స్థానికులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: కొత్తగా పురపాలక సంఘంలో కలిసిన బలగ రూరల్ పరిధిలోని శివరాంనగర్ లేఔట్‌లో మూడు వీధుల మురుగునీరు వెళ్లే కాలువను అక్కడి సీసీ రోడ్డు పనులు చేస్తున్న కాంట్రాక్టరు కప్పేశారు. దీనిపై కాలనీవాసులు నగరపాలక సంస్థ కమిషనర్‌కి ఫిర్యాదు చేసినా ఇంతవరకు ఎటువంటి చర్యలూ తీసుకోలేదు. కంకరతో కాలువని కప్పి సీసీ రోడ్డు నిర్మాణానికి కాంట్రాక్టరు ఏర్పాట్లు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శివరాంనగర్ కాలనీ, భాస్కర్‌నగర్ కాలనీ, తిలక్‌నగర్ కాలనీ ప్రాంతాల మురుగు నీరు, పంటల సాగునీరు ఈ కాలువ ద్వారానే వెళ్తుంది. ఇప్పుడు కాలువకు తూములు కట్టకుండా కంకరతో కప్పివేయడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలువకు ఇరువైపులా ఇళ్లు ఉన్నాయి. కొన్ని వీధుల్లో ఇప్పటికే సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం ఓ వీధిలో సీసీ రోడ్డు వేసేందుకు కాలువను కప్పేశారు. దీంతో ఎక్కడికక్కడ మురుగునీరు పేరుకుపోయి దుర్గంధం వెలువడుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కాలువ సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

## డిసెంబర్‌లో ఘంటసాల ఆరాధనోత్సవం



మాట్లాడుతున్న కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ప్రతినిధి రఘురాం

శ్రీకాకుళం కల్చరల్: జిల్లా కేంద్రంలో డిసెంబరు 21వ తేదీన 12 గంటల పాటు ఘంటసాల ఆరాధనోత్సవం నిర్వహిస్తున్నట్లు హైదరాబాద్‌కు చెందిన కిన్నెర ఆర్ట్ థియేటర్స్ కార్యదర్శి రఘురాం, ట్రెజరర్ సుబ్బారావు తెలిపారు. ఆదివారం పీఎన్ కాలనీలోని వరసిద్ధి వినాయక దేవాలయంలో జీబీఏ స్వరమాధురి వెల్ఫేర్ అండ్ సర్వీస్ సొసైటీ, కిన్నెర ఆర్ట్ థియేటర్స్ సంయుక్త నిర్వహణలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హైదరాబాద్ నుంచి ప్రముఖ గాయకుడు కారుణ్య వచ్చి పాడేందుకు అంగీకరించారని చెప్పారు. జీబీఏ అధ్యక్షుడు పి.జగన్మోహనరావు మాట్లాడుతూ అందరి సహకారంతో కార్యక్రమం విజయవంతం చేస్తామన్నారు. సమావేశంలో కన్వీనర్ నిక్కు అప్పన్న, కనుగుల శ్రీనివాసరావు, ఎం.వి.కామేశ్వరరావు, నృత్య దర్శకులు రఘుపాత్రుని శ్రీకాంత్, జంధ్యాల శరత్‌బాబు, వైకుంఠరావు, రామ్మోహన్, ప్రొఫెసర్ విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల ఔదార్యం



బెహరా మనోవికాస కేంద్రం వద్ద విద్యార్థులు

శ్రీకాకుళం రూరల్: శ్రీకాకుళంలోని బెహరా మనోవికాస కేంద్రానికి సింగుపురంలోని క్రాంతి విద్యానికేతన్ విద్యార్థులు తమ వంతు సహాయ సహకారం అందజేశారు. అందరూ కలిసి సేకరించిన రూ.6,900 నగదును స్కూల్ కరస్పాండెంట్ గుండ అమ్మడు చేతుల మీదుగా కేంద్రం నిర్వాహకులకు ఆదివారం అందజేశారు.

# అలరించిన సుస్వర సంగీత లహరి

శ్రీకాకుళం కల్చరల్:



గీతాలను ఆలపిస్తున్న గాయకులు

నగరంలోని బాపూజీ కళామందిర్‌లో శ్రీకాకుళం మ్యూజిక్ అండ్ డ్యాన్సు అకాడమీ ఆధ్వర్యంలో సంగీత ప్రస్థానంలో 50 ఏళ్లు పూర్తి చేసుకున్న ఇళయారాజా, ఎస్పీ బాలు 5వ వర్ధంతి సందర్భంగా ఆదివారం సుస్వర సంగీత లహరి కార్యక్రమం నిర్వహించారు. పలువురు గాయకులు చక్కటి గీతాలు ఆలపించారు. ఉదయం ట్రాక్ సాంగ్స్ పోటీలు నిర్వహించారు. విజేతలకు ఎమ్మెల్యే గొండు శంకర్ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం కొండలరావుచే శాక్సాఫోన్ కచేరీ జరిగింది. కార్యక్రమంలో అకాడమీ అధ్యక్షుడు జె.వెంకటేశ్వరరావు, వ్యవస్థాపక కార్యదర్శి మావుడూరు సత్యనారాయణ, డాక్టర్ కె.సుధీర్, కె.ఎల్.ఎన్.మూర్తి, ఎం.వి.కామేశ్వరరావు, మార్గదర్శి శ్రీను, డాక్టర్ మాలతి, డాక్టర్ పైడి సింధూర, రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, సోమకుమారి, తదితరులు పాల్గొన్నారు.

# వాటర్ ప్లాంట్ ఏర్పాటుపై నిరసన

రణస్థలం : రణస్థలంలోని జగనన్న కాలనీ సమీపంలో ఆక్వా బ్రేవరీస్ వాటర్ ప్లాంట్ నిర్మించవద్దని రణస్థలం పంచాయతీ గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్లాంట్ వద్ద బండిపాలెం, నగరప్పాలెం, రణస్థలం, జె.ఆర్.పురం గ్రామాల రైతులు, గ్రామపెద్దలు, యువకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్లాంట్ వల్ల భూగర్భ జలాలు అడుగంటిపోతాయని, వ్యవసాయానికి ఇబ్బందులు ఎదురవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్లాంట్ నుంచి వ్యర్థ జలాలు వెళ్లేందుకు సరైన మార్గం లేదన్నారు. ప్రజాభిప్రాయం లేకుండా వేల అడుగుల లోతులో బోర్లు ఎలా వేస్తారని ప్రశ్నించారు. నిరసన కార్యక్రమంలో గ్రామపెద్దలు పిన్నింటి లక్ష్మునాయుడు, కరిమజ్జి మల్లేశ్వరరావు, కరమజ్జి భాస్కరరావు, మజ్జి రమేష్, చందక రమణ, కరిమజ్జి శ్రీను, దన్నాన సీతారాం, కలిశెట్టి బద్రయ్య, ప్లాంట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రైవేటీకరణ నిర్ణయం ఉపసంహరించుకోవాలి

రణస్థలం: మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం అన్ని గ్రామాల్లో విజయవంతం చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ లావేరు మండల పార్టీ అధ్యక్షుడు దన్నాన రాజినాయుడు పిలుపునిచ్చారు. లావేరు మండలం బెజ్జిపురం, బుడతవలస, గుమ్మడం గ్రామాల్లో ఆదివారం రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన మెడికల్ కాలేజీలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేస్తూ ప్రజలను దగా చేస్తోందని మండిపడ్డారు. మోసం చేస్తున్నారని, ప్రజలకు అందాల్సిన విద్య, వైద్యం పట్ల చంద్రబాబు ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచన చేసి మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బొంతు సూర్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యుడు మీసాల సీతంనాయుడు, వైస్ ఎంపీపీ లుకలాపు శ్రీనివాసరావు, మండల ఎగ్జిక్యూటివ్ మెంబర్ వాల్లె దాలినాయుడు, మండల మహిళా అధ్యక్షురాలు మహంతి విజయలక్ష్మి, ఎంపీటీసీల సంఘం అధ్యక్షులు జగ్గురోతు తవిటినాయుడు, సర్పంచ్ రౌతు సురేంద్ర, నాయకులు పెయ్యల లక్ష్మణరావు, ముప్పిడి శ్రీరాములు, కనకం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



కోటి సంతకాల ఉద్యమ సేకరణలో లావేరు వైఎస్సార్‌సీపీ శ్రేణులు

# అప్రమత్తతే శ్రీరామరక్ష

- వరి సాగులో సుడిదోమ బెడద
- తగు జాగ్రత్తలు పాటించాలంటున్న వ్యవసాయాధికారులు



సుడిదోమ రాకుండా ముందస్తుగా మందులను పిచికారీ చేస్తున్న రైతు

జి.సిగడాం: వరి సాగు చేస్తున్న రైతులు పంటలపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. ముఖ్యంగా పంట చివరి దశలో సుడిదోమ ఆశించే అవకాశముందని, ఈ విషయంలో అజాగ్రత్తగా వహిస్తే దిగుబడులు గణనీయంగా పడిపోతాయని హెచ్చరిస్తున్నారు. ఎక్కడైనా సుడిదోమ సోకినట్లు గుర్తిస్తే తక్షణమే సంబంధిత వ్యవసాయ అధికారులను సంప్రదించి సలహాలు, సూచనలు పాటించాలని చెబుతున్నారు.

**కాలిబాటలతో మేలు..**

వరి పైరులో కాలిబాటలు వేసుకుంటే గాలి విస్తారంగా తగిలి చీడపీడలు వ్యాప్తి చాలా తక్కువగా ఉంటుంది. పంటలో సుడిదోమ సోకిన వెంటనే నీరు లేకుండా ఉంచాలి. సుడిదోమ పొలం నుంచి పక్క పంట పొలంలోకి వ్యాపించే అవకాశముంటుంది. వేపనూనె పిచికారీ చేస్తే సుడిదోమను నివారణ చేయవచ్చు.

**ఈ జాగ్రత్తలు తప్పనిసరి..**

వ్యవసాయశాఖ ద్వారా లైసెన్స్ ఉన్న డీలర్లు నుంచే పురుగుమందులు కొనుగోలు చేయాలి. డబ్బాలపై వజ్రాకారంలో పురుగు మందుల స్థాయిని తెలిపే రంగులు ఉంటాయి. అత్యంత విషపూరితమైతే నీలంరంగు, స్వల్ప విషపూరితమైతే ఆకుపచ్చ రంగు గుర్తులు ఉంటాయి. వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు సూచించిన మందులను మాత్రమే వాడాలి.

**అప్రమత్తంగా ఉండాలి**

పంట ఆఖరి దశలో ఎక్కువగా సుడిదోమ వచ్చే అవకాశం ఉంది. ప్రతి రోజూ రైతులు పంట పొలాలను చూసి ఎక్కడైనా దోమ సోకినట్లు ఉంటే వ్యవసాయ సిబ్బందికి సమాచారం ఇవ్వాలి. క్షేత్రస్థాయిలో పరిశీలించి సుడిదోమ నివారణకు చర్యలు తీసుకుంటాం.

– బెండి బాబ్జీ, మండల వ్యవసాయాధికారి, జి.సిగడాం

# రోడ్డు నిర్మాణానికి మోక్షమెప్పుడో?

- రామచంద్రాపురం ఎస్టీ కాలనీలో గోతులమయంగా దారి
- పౌర సరఫరాల సంస్థ గొడౌన్ ఉన్నా పటిష్ట రోడ్డు లేక అవస్థలు



రామచంద్రాపురం ఎస్టీ కాలనీకి వెళ్లే రోడ్డులో గోతులు

గార: తాము అధికారంలోకి వచ్చిన వెంటనే రహదారుల సమస్య పరిష్కరిస్తామని చెప్పిన కూటమి పాలకులు ఇప్పుడు కనీసం ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. గార మండలం రామచంద్రాపురం పంచాయతీ ఎస్టీ కాలనీ (ఎరుకుల కాలనీ) గ్రావెల్ రోడ్డు గోతులమయం కావడంతో స్థానికులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళ ద్విచక్రవాహనాలు అదుపుతప్పి పడిపోయిన సందర్భాలు చోటుచేసుకుంటున్నాయి. సుమారు కిలోమీటరు ఉన్న ఈ దారిని బీటీ రోడ్డుగా మార్పు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఇక్కడ 36 కుటుంబాలు నివాసముంటుండగా, మరి కొన్ని గృహాల నిర్మాణాలు జరుగుతున్నాయి. ఇదే ప్రాంతంలో రూ.1.15 కోట్లతో 1000 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల సివిల్ సప్లయ్స్ గొడౌన్ ఉంది. నిర్మాణం పూర్తయినా ఇప్పటికీ ఇది ప్రారంభానికి నోచుకోలేదు. రోడ్డును బీటీ రోడ్డుగా తయారు చేస్తే వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తొలగుతాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో సర్పంచ్ గొలివి వెంకటరమణమూర్తి సుమారు రూ.8 లక్షల వ్యయంతో గోర్జుగా ఉన్న దారిని గ్రావెల్ రోడ్డుగా వేశారు. ఆ తరువాత కలెక్టర్ ప్రత్యేక నిధులతో కొంత మేర స్టోన్ క్రషింగ్ డస్ట్ వేశారు. మిగిలిన రోడ్డు గోతులుగా మారడంతో కొద్దిపాటి వర్షం వచ్చినా నీరు నిలిచిపోతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

**ప్రయాణం నరకం**



గోతులు ప్రమాదకరంగా మారాయి. ఎక్కడ కిందపడిపోతామోనని భయమేస్తోంది. గత ప్రభుత్వంలో మట్టిరోడ్డును కంకర రోడ్డుగా చేశారు. ఇటీవల వర్షాలతో పెద్ద గోతులు ఏర్పడి ఇబ్బందులు పడుతున్నాం. తారు లేదా సిమెంట్ రోడ్డు నిర్మించాలి.

– గొర్లె వెంకటమ్మ, ఎస్టీ కాలనీ, రామచంద్రాపురం

**ఇబ్బందులు..**



రాత్రి వేళ మాగ్రామంలోకి ఎవరు రావాలన్నా ఇబ్బందులు పడుతున్నారు. పగలు కూడా జాగ్రత్తగా బైక్‌ల మీద రావాల్సి ఉంటుంది. పక్కనే గొడౌన్ ఉన్నా తెరవకపోడంతో రోడ్డు కోసం ఎవ్వరూ పట్టించుకోవడం లేదు.

– గేదెల రాజారావు, ఎస్టీ కాలనీ, రామచంద్రాపురం

# మాస్టర్‌ప్లాన్‌కు అనుమతులు అన్యాయం



సమావేశంలో పాల్గొన్న మాస్టర్‌ప్లాన్ బాధితులు

శ్రీకాకుళం: ప్రభుత్వం విడుదల చేసిన జీవోఎంఎస్ 154లో ప్రతిపాదించిన 150 అడుగుల మాస్టర్‌ప్లాన్‌కు అనుమతులు ఇవ్వడం అన్యాయమని పెద్దమ్మ తల్లి ఆలయ కమిటీ ప్రెసిడెంట్ డి.పి.దేవ్, నక్క శంకరరావు, డాక్టర్ వండాన కిరణ్‌కుమార్ అన్నారు. ఆదివారం సీబీ రోడులోని పెద్దమ్మ తల్లి గుడి ఆవరణలో మాస్టర్ ప్లాన్ బాధితుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొద్దిరోజుల ముందు వరకు బిల్డింగ్ పర్మిషన్లు ఇచ్చి ఇప్పుడు ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా పక్కనే 80 అడుగుల రోడ్డు ఉన్నా మాస్టర్ ప్లాన్ 150 అడుగుల రోడ్డుగా ఆమోదించడం అన్యాయమన్నారు. ఈ ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో విశ్వహిందుపరిషత్ సభ్యులు, వివిధ లేఅవుట్ల సభ్యులతో పాటు బీవీఎస్ మూర్తి, నాగేశ్వరరావు, ఇంజినీర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ముని శ్రీనివాసరావు, రమేష్ చక్రవర్తి, ఎంఎస్‌టీ పట్నాయిక్, వీహెచ్‌పీ లోకనాథ్ ఆనంద్, తంగుడు రాజు తదితరులు పాల్గొన్నారు.